# మోక్షం

రజని కోపంతో ఇంటి తలుపులు దభాల్న వేసి సూటుకేసు చేతిలో పట్టుకొని బయటికి వచ్చింది. కాని - ఆ పదిగంటల రాత్రి ఎక్కడికి వెళ్ళాలో రజనికి అర్థం కాలేదు.

తన దగ్గరున్న డబ్బు - తన బ్యాంకు అకౌంటు బుక్, చెక్‌బుక్ అన్నీ చేతి బ్యాగులో వేసుకుంది. ఆ బ్యాగు ఆమె భుజానికి వేలాడుతుంది. ఎడమ చేత్తో భుజానికి వేలాడే బ్యాగును గట్టిగా పట్టుకుంది. కుడిచేతిలో సూటుకేసుతో నడిచి సందు దాటి మెయిన్ రోడ్డు మీదికి వచ్చి నిలబడింది. ఇంతరాత్రి ఎక్కడికి వెళ్ళాలా? అనుకుంది. అటుయిటు చూసింది. విద్యుత్తు స్తంభాలు నిటారుగా నిలబడి నిండు పున్నమినాటి వెన్నెలలాంటి కాంతులను వెదజల్లు తున్నాయి.

రోడ్డంతా నిశ్చలంగా నిశ్శబ్దంగా వుంది. అది చలికాలం. అందులో బంగాళాఖాతంలో వచ్చిన అల్పపీడనం వల్ల చల్లని ఈదురుగాలులు వీస్తున్నాయి. షాపులన్నీ మూసేసారు. అక్కడక్కడా సిగరెట్టుకొట్టులు తీసి వున్నాయి.

హఠాత్తుగా జంటగా ఇద్దరు యువకులు ఆమె ముందు నుంచే వెళ్తూ కన్పించారు. వాళ్ళ అడుగులు తడబడుతున్నాయి. తాగి వున్నారేమో! - భయపడింది రజని.

ఆ యువకులు రజని వైపు చూస్తూ అటువైపు ఒకసారి ఇటువైపు ఒకసారి పరేడు చేసారు. రజని కదలలేక బిగుసుకపోయింది. ఆ యువకులు ఈల వేస్తూ వెళ్ళిపోయారు. రజని నిట్టూర్చింది.

రజని నిట్టూర్పు వదిలిందో లేదో ఇంతలో స్కూటరు మీద పోతున్న ఒకతను ఆమె పక్క నుంచి బర్రుమని కాస్త ముందుకు వెళ్ళి స్కూటరు ఆపాడు. స్కూటరు మీద కూర్చునే వుండి వెనుకకు తిరిగి చూస్తూ ఆగిపోయాడు. ఎంతసేపైనా కదలడం లేదు. అతని చూపుల్లో

ఏదో వికారం! అది చూసి రజని గజగజ వణికిపోయింది. గబగబ ముందుకు నడిచింది. కాస్త దూరం వెళ్ళి వెనుకకు చూస్తే స్కూటరతను లేడక్కడ రజని రోడ్డు పక్కగా నిలబడి అటుయిటు చూసింది.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఒక్క ఆటోగాని ఒక్క రిక్షాగాని కనపడ్డంలేదు. ఈ రాత్రి పూట ఎక్కడికి వెళ్ళాలి తను! మళ్ళీ ఆమె మనసులో అదే ప్రశ్న !

ఆమె పనిచేసే బ్యాంకులో తన కొలీగ్స్ ఆమెకు దగ్గరైనవాళ్ళు మనసులో మెదిలారు. వాళ్ళల్లో లీల తనకు చాలా దగ్గరి స్నేహితురాలు. మనస్సు విప్పి మాట్లాడుకుంటారు. కలిసి సినిమాలకు షాపింగులకు కూడా వెళ్తారు! లీల తనతో క్లోజుగానే వుంటుంది. క్లోజుగా వుంటుంది కదా అని దానింటికి ఈ రాత్రి వెళ్తే ఏం బాగుంటుంది! దాని అత్తగారు మామగారు వాళ్ళింట్లోనే వుంటారు. దాని బాధలు దానికున్నాయి. నేను ఈ రాత్రి వెళ్ళి దాన్ని బాధపెట్టడం ఏం బాగుంటుంది! పోనీ ఉమ ఇంటికి వెళ్ళనా? అనుకుంది రజని. ఉమ కూడా తన కొలీగ్సుల్లో తనతో క్లోజుగానే వుంటుంది. కాని ఇంత రాత్రి దాన్ని లేపితే ఏం బాగుంటుంది. దాని భర్త ఏమనుకుంటాడు! రజనికి ఎక్కడికి వెళ్ళాలో తోచలేదు.

"రేపు వర్కింగు డే. తను బ్యాంకుకు వెళ్ళాలి పనికి! సెలవు పెట్టినా ఎన్ని రోజులని పెడ్తుంది! సెలవు పెట్టి నాలుగు రోజులు ఆదివారం కలిపి ఐదు రోజులు. వైజాగ్ తలిదండ్రుల దగ్గరికి పోతే!

అమ్మో! తలిదండ్రుల దగ్గరికా? తను చక్కగా కాపురం చేసుకుంటూ భర్తతో హాయిగా వున్నానని వాళ్ళు అనుకుంటున్నారు. ఈ వయస్సులో వాళ్ళ శాంతికి భంగం కలిగించడమెందుకు? అయినా అక్కడికి వెళ్తే ఉద్యోగం విడిచిపెట్టి తను ఎన్నాళ్ళు వుంటుందక్కడ!

తన ఉద్యోగం, జీతం చూసేకదా శ్రీకాంత్ తనను పెళ్ళి చేసుకున్నాడు! కాని తను మాత్రం అతని కోరినట్లు జీతం డబ్బంతా అతని చేతిలో పోయలేదు! "అదే కోపమేమో శ్రీకాంత్‌కు" అనుకుంది రజని.

"ప్రతిరోజు సూటిపోటి మాటలతో మనస్సును తూట్లు పడేటట్లుగా పొడుస్తున్నాడు. ఏ పని చేసినా దానికో వంక పెడ్తాడు. ఏదో తప్పు తీస్తాడు. ఆడదానికి క్షమ, శాంతం ఉండాలంటారు. అవి మగవాళ్ళకవసరం లేదా! సర్దుకొని పోవడం ఆడదే చేయాలా? స్నేహం ప్రేమలు పరస్పరం ఇచ్చి పుచ్చుకోవాలనే అవగాహన లేనంత కాలం - మగవాళ్ళు తమదే పైచేయిగా వుండాలనే తత్త్వం మారనంతవరకు క్షమ శాంతం ఎంతకాలం ఆడది మాత్రమే చూపుతుంది! ఎన్నాళ్ళని తను ఈ మానసిక హింసను భరిస్తుంది! -

అయినా ఎందుకు భరించాలి తను ! ఎప్పుడో సుమతి సీతలు భర్తలు ఏదంటే అది చేసారని నోరు మూసుకొని భరించారని - ఇప్పుడు - ఈ యుగంలో తను అలా చేయాలంటే

ఎందుకు చేయాలి తను! -

తను ఉద్యోగం చేస్తున్నది ! అతడెంత సంపాదిస్తున్నాడో తనంతా సంపాదిస్తున్నది. ఆర్థికంగా తన కాళ్ళ మీద తను నిలబడగలదు! అట్లాంటప్పుడు నేనేదైనా చెప్తే చేయడానికి అతనికి నామోషి! అగౌరవం! అతడు చెప్పేదే నేను చేయాలి! లేకపోతే అతని పురుషాహంకారానికి దెబ్బ ! -

ఇద్దరూ సమానంగా ఒకరినొకరు గౌరవించుకుంటూ ఎందుకు బతకకూడదు. శ్రీకాంత్ అదెప్పుడైనా నేర్చుకుంటాడా? అట్లా నేర్చుకున్ననాడే తను అతని దగ్గరికి వెళ్తుంది. లేకపోతే ఇంతే!-

ఒకరోజు తను బ్యాంకు నుంచి వెళ్తూ దుకాణం ముందు అందమైన చీర వేలాడదీసి వుంటే చూసి బాగుందని ఇష్టపడి కొనుక్కొని ఇంటికి వెళ్ళింది. అప్పటికే శ్రీకాంత్ ఇంట్లో వున్నాడు.

"ఏమిటా ప్యాకెట్?" అడిగాడు విసురుగా. ఎప్పుడూ అంతే అతని తీరు. మామూలుగా ఎప్పుడూ మాట్లాడడు. సంపాదించే పెళ్ళాం కావాలనుకున్నవాడు సంపాదించే స్త్రీని గౌరవించడం మన్నించడం తెలుసుకోవాలి! అదేది లేదు అతనిలో.

"చీర! నచ్చింది కొనుక్కున్నాను" అంది ఆగి ఆగి.

"నెలకెన్ని చీరలు తగిలేస్తావే! ఇట్లా డబ్బు దండుగ చేసేందుకేనా నువ్వు ఉద్యోగం చేస్తున్నది!" కసురుకున్నాడు.

కళ్ళల్లో ఉబికిన నీళ్ళను బయటికి రానీయకుండ తను కనురెప్పలాడించి ఆపుకుంది. వంట చేయడానికని వంటింట్లో దూరింది తను.

శ్రీకాంత్ ఇంట్లో ఏ పనీ సాయం చేయడు. పెళ్ళికాక ముందు ఒక్కడే ఇల్లు తీసుకొని వుండేవాడు. అట్లా అతనికి కొంతవరకు వంట చేయడం వచ్చు. అలవాటుంది - కాని పెళ్ళయ్యాక ఏ బాధ్యత తీసుకోలేదు. కూరగాయలు తెచ్చుకోవడం, సామాన్లు కొనుక్కోవడం అన్నీ తన బాధ్యతే. ఇంట్లో ఏది లేకపోయినా ఏం పట్టించుకోడు. కాని భోజనం చేసేటప్పుడు ఏది తక్కువైనా కంచం ఎత్తేస్తాడు. గ్లాసు తీసి నేలకేసి కొడ్తాడు. నానా హంగామా చేస్తాడు.

పెళ్ళయిన కొత్తలోనే ఏ ఖర్చు ఎవరు పెట్టాలో శ్రీకాంత్ నిర్ణయించేసాడు. అప్పుడు తనకు అతని వ్యాపారతరహా నచ్చలేదు. కాని అది మంచికే జరిగిందేమో అనుకుంది తర్వాత. లేకపోతే తమ మధ్య ఎన్ని పోట్లాటలు తగవులు వచ్చేవో! తమ ఒప్పందంలో లేని ఏ కొత్త ఖర్చు వచ్చినా శ్రీకాంత్ జేబులోంచి డబ్బు తీయడు. తను తెలుసుకొని సర్దుకొని పోతున్నది. లేకపోతే నలుగురి ముందు డబ్బు నువ్వు ఖర్చు పెట్టాలి! నువ్వు ఖర్చు పెట్టాలి అని తగవులాడుకుంటే ఏం బాగుంటుంది. అనుకొని తనే పర్సులోంచి డబ్బు తీసి యిచ్చేది."

అయితే - ఈరోజు డబ్బు ఎవరు ఖర్చుపెట్టాలి అన్న విషయంలోనే తగాదా వచ్చింది

రజని శ్రీకాంత్‌ల మధ్య.

"మా బ్యాంకులో పనిచేస్తాడు ప్రతాప్ అనీ ఆయన చెప్పాడు. అతనికి తెల్సినవాళ్ళెవరో ఫ్లాట్సు కడ్తున్నారట! మనం ముందే బుక్ చేసుకుంటే ఫ్లాటు చాలా తక్కువ ధరకు పడ్తుందట! తీసుకుందామా?" అని అడిగింది రజని భర్తను.

శ్రీకాంత్ టీవి సీరియల్ చూడడంలో మునిగిపోయి వున్నాడు. టీవీలో వచ్చే ముప్పైకి పైగా ఛానళ్లలో అతనికి నచ్చిందే పెట్టుకొని చూస్తుంటాడు. అతనికి నచ్చిన ప్రోగ్రాం చూడడమే రజనికి అలవాటయింది. ఒకవేళ ప్రోగ్రాం అంతగా నచ్చకపోతే రజని ఏ పుస్తకమో చదువుకుంటుంది. కాని తనకు నచ్చిన ప్రోగ్రాం పెట్టమని అడగడానికి ఆమెకు భయమే.

శ్రీకాంత్ టీవి స్క్రీను మీది నుంచి మెల్లగా దృష్టి తిప్పి "మొత్తం ఎంతట?" అడిగాడు పట్టింపు లేని గొంతుతో. రజని చెప్పింది. "అమ్మో! అంత డబ్బా! అయినా నీకు బ్యాంకు లోన్ ఇస్తారు. ఆ లోన్‌తో తీసుకో!" అన్నాడు.

"ఏం! మీ జీతం ఏం చేస్తున్నారు. మీ సేవింగ్సులోంచి కొంత మీరు పెట్టండి - కొంత నేను పెడ్తాను" అంది రజని.

"నా దగ్గర డబ్బు లేదు!" అన్నాడు శ్రీకాంత్ కోపంగా.

"ఏం! ఎందుకు లేదు?" అడిగింది రజని.

"లేదన్నాను గదా!" అరిచాడు శ్రీకాంత్.

"అదే ఎందుకు లేదు! అని అడుగుతున్నాను" అంది రజని.

"నేను మగవాడ్ని. నాకెన్నో ఖర్చులుంటాయి!"

"అంటే ఆడవాళ్ళకు ఖర్చులుండవా? మీరు నెలకింత డబ్బు ఇచ్చి ఇంటి బాధ్యత ఏదీ పట్టించుకోకుండా గెస్టులాగా వుంటున్నారు! అది గ్రహించారా మీరు!" అంది రజని.

"ఆహా!" నవ్వాడు శ్రీకాంత్ వెటకారంగా.

"సంపాదించే ఆడదానికి భర్త గెస్టులాగానే వుంటాడు! మరి!" కోపంగా అన్నాడు శ్రీకాంత్.

"అట్లా అనలేదు నేను. మీరెప్పుడూ నా డబ్బు నీ డబ్బు అంటారు. మనిద్దరి డబ్బు అంటూ ఖర్చు పెట్టలేమా? ఎందుకీ వేర్పాటు?" తగ్గుస్వరంతో అడిగింది రజని.

"హా! హా!" కృత్రిమంగా నవ్వాడు శ్రీకాంత్.

"ఆ మాట ఇప్పుడంటున్నావా? ఈ వేర్పాటు ధోరణి తెచ్చిందెవరు? పెళ్ళి కాగానే నీ జీతం డబ్బు నాకిచ్చావా? నీ సంపాదన నువ్వు చూసుకున్నావు. బ్యాంకులో పని చేస్తున్నావు కదా! బ్యాంకులో డబ్బు ఎట్లా వెయ్యాలో తియ్యాలో నీకు తెలుసు గదా! ఇక నాతో నీకేం పని!" కసిగా మాట్లాడాడు శ్రీకాంత్.

"నా జీతం! మీకెందుకియ్యాలి నేను"

"నేను నీ భర్తను!"

"భర్త! - అంటే"

"అంటే నీ మొగుణ్ని! మగాడ్ని!" అని శ్రీకాంత్ పెద్ద గొంతుతో అరిచాడు.

'కేవలం మగాడు అయినంతమాత్రాన ఆడది బానిస అని అనుకోకండి" రజనికి కూడా కోపం ఆగలేదు.

"బానిస! - అసలు నువ్వు - నన్ను బానిసను చేసావు. నీకు గర్వం! అహంకారం! సంపాదిస్తున్నా నని మొగుడంటే లెక్కలేదు" అంటూ శ్రీకాంత్ రజని మీదికి లేచాడు.

రజని భయంతో వెనుకకు జరిగింది.

"గర్వం! అహంకారం! నాకా ఎందుకు?" మెల్లగా ప్రశ్నించింది రజని.

"ఉద్యోగం చేస్తున్నావు గదా! నీ ఇష్టమే నడవాలి! నీవన్నదే కావాలి! అంతేనా? - అసలు మొగుడనే వాడున్నాడని ఎన్నడైనా గౌరవం ఇచ్చావా? నీ ఇష్టమున్నది కొనుక్కొని వస్తావు! నీ ఇష్టమున్నది చేస్తావు!" పెద్దగా అరవడం మొదలుపెట్టాడు శ్రీకాంత్.

రజని ఇక అతని మాటలు భరించలేకపోయింది. "రోజూ నానా మాటలు వింటూ ఈ ఇంట్లో పడి వుండి అతనికి వండిపెడ్తూ భయపడ్తూ చాకిరి చేస్తూ ఎందుకుండాలి!" రజని మనస్సు ఎదురు తిరిగింది. ఆ తిరుగుబాటుతో పాటు ఆమెలో దు:ఖం ఉప్పొంగింది. పెద్దగా ఏడ్వాలనిపించింది. కాని ఏడ్వలేకపోయింది. కన్నీళ్ళన్నీ ఇంకిపోయినట్లుగా అనిపించింది. ఆమె మనస్సు అతని మాటలతో చేతలతో విసిగిపోయింది. ఓపిక నశించింది. దీన్నుంచి తనకు విముక్తి కావాలి! ఈ మానసిక హింస స్నేహం ప్రేమలేని వాతావరణం నుంచి మోక్షం కావాలి. పడగ్గదిలోకి పోయి సూటుకేసులో బట్టలన్నీ సద్దుకుంది. బ్యాగు భుజానికి తగిలించుకొని బయటికి నడిచింది.

శ్రీకాంత్ అడ్డం వచ్చి ఆపుతాడేమోననుకుంది. ఇంతరాత్రి ఎక్కడికి వెళ్తావు అంటాడనుకుంది. కాని అతడు బయటికి రాలేదు. ఆమె అనుకున్నదేమీ జరుగలేదు. రజని సూటుకేసుతో బయటికి వచ్చింది. -

ఆలోచిస్తూ రజని రోడ్డు పక్కగా ముందుకు నడిచింది. సైకిల్ మీద ఒకతను వేగంగా పోతూ రజనికి దగ్గరగా దూసుకపోయాడు. దూసుకపోతూ రజని వక్షస్థలం మీద చేయివేసి గట్టిగా కొంగు పట్టుకొని లాగుతూ పోయాడు. రజని షాక్‌తో కొంగును గట్టిగా పట్టుకొని నిలబడిపోయింది.

"దీన్నంతా ఎదుర్కోవడం నేర్చుకోవాలి తను!" అనుకుంది రజని.

ఇంతలో -

"కహీఁ జానాహై" అంటూ ఆటోడ్రైవరు ఆటోను ఆమె దగ్గరగా ఆపాడు.

రాత్రి ఒక్కదాన్ని యీ ఆటోలో ఎక్కితే అతడు తనను ఏ సందులోకో గొంద్మలోకో తీసుకపోయి తన గొలుసూ గాజులు డబ్బు లాక్కుంటే - లేదా ఏ వేశ్యాగృహంలోనో వదిల్తే! వణికిపోయింది రజని. వెంటనే రజని తన ఊహ అనవసరమైంది - అని నవ్వుకుంది.

అంత భయమైతే ఎట్లా! ధైర్యంగా వుండడం నేర్చుకోవాలి అనుకుంది రజని.

ఎక్కడికని చెప్పను? గట్టిగా ఆలోచించింది రజని.

అప్పుడామెకు బ్యాంకులో పనిచేసే ప్యూను గోవిందం జ్ఞాపకానికి వచ్చాడు. ఒకసారి అతను బ్యాంకు వాళ్ళందర్నీ చిక్కడపల్లిలోని అతనింటికి పిల్చాడు. అప్పుడు అతని ఇల్లు భార్యా పిల్లల్ని చూసింది.

"ఈ రాత్రి అతనింటికి పోయి రేపట్నుంచి ఇల్లు కోసం వేటాడాలి" అని నిశ్చయించుకుంది రజని.

"చిక్కడ్‌పల్లీ చలో" అని చెప్పి రజని ఆటో ఎక్కింది.

* * *